సాక్షి నిర్మల్

ఆదివారం । 9 । జూన్ । 2024



జీవన భారం..ఉపాధి ప్రశ్నార్థకం!
బీడీ పరిశ్రమపై ఆధారపడిన వారికి ప్రస్తుతం ఉపాధి కరువవుతోంది. పని లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు.
8లో▸



అందని ద్రాక్షగానే 'డబుల్' ఇళ్లు
కడెం మండలకేంద్రంలోని పెద్దూర్ సమీపంలో నిర్మించిన 200 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి నోచుకోవడం లేదు.
9లో▸

గరిష్టం/కనిష్టం
35.5 /26.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉపరితల ఆవర్తనం, రుతుపవనాల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

పండితులు, పీఈటీలకు శుభవార్త



- పోస్టులు అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో 224 మందికి లబ్ధి
- రేపటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నిర్మల్ రూరల్ : రాష్ట్రంలోని భాషా పండితులు, పీఈటీలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. బదిలీలు, పదోన్నతులు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొన్నేళ్లుగా ప్రమోషన్ల కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలతో పాటు తమకూ పదోన్నతులు కల్పించాలని, తమ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలో గతనెల హైకోర్టు భాషా పండితులు, పీఈటీలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో వివాదం కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలతోపాటు భాషా పండితులు, పీఈటీలకూ ప్రమోషన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది.

ఇదీ అసలు వివాదం..
రాష్ట్ర ప్రభుత్వం పండితులకు, పీఈటీలకు ప్రమోషన్లు ఇవ్వనుండడంతో జిల్లాలో 224 మంది ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరనుంది. ఇన్నేళ్లుగా వీరు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ ఎస్జీటీ క్యాడర్‌గానే ఉండిపోయారు. అదే హోదాలో చాలా మంది ఉద్యోగ విరమణ కూడా చేశారు. సమాన పనికి సమాన వేతనం లేకపోవడంతో తమ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు మొరపెట్టుకున్నారు. ఐదేళ్ల క్రితం అప్పటి సీఎం కేసీఆర్ సైతం రాష్ట్ర తెలుగు మహాసభల్లో పండితులు, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. షెడ్యూల్ కూడా విడుదల చేశారు. కానీ బీపీఈడీ, పండిత కోర్సులు చేసిన ఎస్జీటీలు తాము కూడా ప్రమోషన్లకు అర్హులమేనని కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ ఆగిపోయింది. ఇలా రెండుసార్లు జరిగింది. ఇటీవలే పండితులు, పీఈటీలకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో ఆటంకం తొలగింది.

వివరాలు...	
జిల్లాలో పనిచేస్తున్న పీఈటీలు	37
అప్‌గ్రేడ్ అయిన పోస్టులు	32
పనిచేస్తున్న పండితులు	215
అప్‌గ్రేడ్ అయిన పోస్టులు	192

32 పీఈటీ, 192 పండిత పోస్టులు అప్‌గ్రేడ్.
జిల్లాలో 32 పీఈటీ పోస్టులను పీడీలుగా, 192 పండిత పోస్టులను గ్రేడ్–2గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 32 పీఈటీ పోస్టుల్లో 31 తెలుగు మీడియం కాగా, ఒక పోస్టు ఉర్దూ మీడియంలో ఉంది. ఇక పండితుల విషయానికొస్తే మొత్తం 192 పోస్టులను అప్‌గ్రేడ్ చేయగా, ఇందులో 98 మంది తెలుగు పండితులు, 86 హిందీ పండితులు, 06 ఉర్దూ, 02 మరాఠీ పండిత పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. ఇన్నేళ్లు ఎస్జీటీ క్యాడర్ కింద పనిచేసిన వీరు ప్రమోషన్ తర్వాత స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లోకి మారనున్నారు.

వెట్టి చాకిరీ నుంచి విముక్తి



ప్రభుత్వం ప్రమోషన్లకు షెడ్యూల్‌ను ప్రకటించడంతో పండిత, పీఈటీలు పోస్టులు అప్‌గ్రేడ్ చేయడంతో వెట్టి చాకిరీ నుంచి విముక్తి లభించింది. చారిత్రక నిర్ణయం తీసుకున్న కొత్త ప్రభుత్వానికి ఉపాధ్యాయుల తరఫున కృతజ్ఞతలు. ఇన్నేళ్లు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నప్పటికీ ఎస్జీటీ క్యాడర్ జీతాలు తీసుకున్నాం. ప్రభుత్వం తొందరగా ప్రమోషన్ల ప్రక్రియ ముగించాలి.
– గంగాధర్, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు

ఎన్నో ఏళ్ల పోరాట ఫలితం..



పండిత, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించేలా షెడ్యూల్ విడుదల చేయడం హర్షనీయం. ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఎన్నో ఏళ్లుగా దీనికోసం పోరాడుతున్నాం. ఇన్నాళ్లకు మా పోరాటం ఫలించింది. మాకు న్యాయం చేసినందుకు మరింత ఉత్సాహంతో పని చేస్తాం.
– భోజన్న, పీఈటీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి



ఉపాధ్యాయ బదిలీలు ప్రమోషన్ల కోసం ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. పండితులు, పీఈటీలు ప్రమోషన్ల కోసం సోమవారం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి. 11న సీనియారిటీ జాబితా ప్రకటిస్తాం. మార్పులు చేర్పులను సవరిస్తాం. షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో ప్రక్రియ నిర్వహిస్తాం.
– రవీందర్‌రెడ్డి, డీఈవో

న్యూస్‌రీల్

ఢిల్లీలో ఆత్మీయ భేటీ



ఎంపీలు బండి సంజయ్, గోడం నగేశ్‌లతో ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పి రామారావు పటేల్

భైంసాటౌన్: ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపీలు బండి సంజయ్, గొడం నగేశ్ ఢిల్లీ వెళ్లారు. వీరితోపాటు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ కూడా ఢిల్లీ వెళ్లి ఎంపీలను కలిశారు. ఈ మేరకు వారితో ఆత్మీయ భేటీలో పాల్గొన్నారు. ఎంపీలుగా ఎన్నికైన నేపథ్యంలో అభినందనలు తెలిపారు. వారివెంట ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా ఉన్నారు.

లోకేశ్వరం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జానకీషర్మిల

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జానకీషర్మిల శనివారం తనిఖీ చేశారు. ఠాణా పరిసరాలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో గస్తీలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ఎస్సై రాజు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కుంటాల: లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ అరుణ రమణారావు శనివారం ఢిల్లీలో కలిశారు. కిషన్‌రెడ్డితోపాటు ఎంపీలు గోడం నగేశ్, రఘునందన్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బుధవార్‌పేట్ ఎస్సీ కాలనీ సమీపంలోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోళ్ల వెంకటస్వామి తెలిపారు. ఈ సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నూతన కమిటీల ఏర్పాటుకు పదాధికారుల, కార్యవర్గ సభ్యుల అభిప్రాయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో సభ్యులు హాజరు కావాలని కోరారు.

'నీట్'లో అవకతవకలపై న్యాయవిచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి దిగంబర్

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ జరిపించి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో నిస్పాక్షికంగా విచారణ చేయాలని కోరారు. విచారణలో దోషులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



ఆడిట్ నిర్వహిస్తున్న సునీల్

కుంటాల: స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని చార్టెడ్ అకౌంటెంట్ బొడేకేవార్ సునీల్ పేర్కొన్నారు. మండల సమాఖ్య భవనంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీలపై శనివారం ఆడిట్ నిర్వహించారు. ఈఆడిట్‌లో సీబీవో ఆడిటర్ పోశెట్టి, ఏపీఎం అశోక్, అకౌంటెంట్ శివప్రసాద్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, వీవోఏలు పాల్గొన్నారు.

'డబుల్' ఆక్రమణ!



డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద కడెం, కన్నాపూర్ గ్రామాల పేదలు..

- తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి..

కడెం: మండలంలోని పెద్దూర్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి ఏళ్ల గడుస్తున్నా.. వాటిని అధికారులు లబ్ధిదారులకు కేటాయించడం లేదు. దీంతో కడెం, కన్నాపూర్ గ్రామాల పేదలు శనివారం తాళాలు పగులగొట్టి ఆక్రమించుకున్నారు. అర్హుల జాబితాను సిద్ధం చేసినా ఇళ్లు పంపిణీ చేయకపోవడంతో తామే ఇళ్లలోకి వచ్చేశామని తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఇళ్లు ఖాళీ చేయాలని సూచించారు. అయినా ఎవరూ వినిపించుకోలేదు. తమ సామగ్రిని ఇళ్లలో పెట్టి తాళాలు వేశారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు.



పోలీసులతో స్థానికుల వాగ్వాదం..

రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్



రాజీపత్రం అందజేస్తున్న కర్ణకుమార్

నిర్మల్‌టౌన్: తెలిసో తెలియకో చేసిన నేరాలకు ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరగకుండా.. రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకే లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తెలిపారు. జిల్లా ప్రధాన కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. చట్టాల ఆవశ్యకతను వివరించి కేసులు పరిష్కరించాలన్నారు. ఇందులో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. నిర్మల్ కోర్టులో మూడు, భైంసా కోర్టులో 1, ఖానాపూర్ కోర్టులో 1 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో 2 సివిల్ కేసులు, 3,179 క్రిమినల్, 103 బ్యాంకు సంబంధించినవి, 52 సైబర్ క్రైమ్ కేసులు కలిపి మొత్తం 3,336 పరిష్కరించినట్లు వివరించారు. ఇందులో జూనియర్ సివిల్ జడ్జి భవిష్య, లోక్ అదాలత్ సభ్యులు రమణగౌడ్, లింగయ్య, వీవీ.రమణారావు, ఎండీ.ఫసియొద్దీన్, నివేదిత, మధుకర్, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

భైంసా కోర్టులో 1,044 కేసుల పరిష్కారం

భైంసాటౌన్: పట్టణంలోని కోర్టు కార్యాలయంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సంస్థ చైర్మన్, జడ్జి డి.దేవేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 1,044 కేసులు పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.శంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

- కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తామని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో శనివారం మాట్లాడారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు రేయింబవళ్లు కష్టపడి మెజార్టీ తీసుకువచ్చారన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తూనే ప్రజా సమస్యలను తీరుస్తూ వారి సమస్యల పరిష్కారంలో భాగస్వామి అవుతానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున నిర్మల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తల విషయంలో ఏదైనా పొరపాటు చేసి ఉంటే క్షమించాలని కోరారు.

ప్రజలను తప్పుదోవ పట్టించారు..
పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలు అసత్య, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాయని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. కులం మతం పేరు చెప్పి గెలుపొందారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసేదే చెప్పి ప్రజలను ఓట్లు అడిగిందని తెలిపారు. ఓడిపోయినా ప్రజల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలు తమని తప్పకుండా గుర్తిస్తారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు ఏంబడి రాజేశ్వర్ నాయకులు పాల్గొన్నారు.

కన్కపూర్ ఎత్తిపోతల పథకానికి నిధులు



కన్కపూర్ ఎత్తిపోతల పథకం

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామ సమీపంలో గోదావరి నది ఒడ్డున నిర్మించిన ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరయ్యాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. కన్కపూర్ ఎత్తిపోతల పథకం అదనపు పైపులైన్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లీకేజీల మరమ్మతుల కోసం నీటిపారుదల శాఖ నుంచి రూ.1,42,62,000 మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చే సినట్లు పేర్కొన్నారు. పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. నిధులు మంజూరు చేయడంతో అబ్దుల్లాపూర్, కన్కపూర్, జోహర్‌పూర్, వడ్‌తాల్, చింతకుంట గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీల అధ్యక్ష పదవులు బీసీలకు ఇవ్వాలి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నర్సగౌడ్

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాష్ట్ర అధ్యక్ష పదవులను బీసీలకు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సగౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు బీసీ నినాదంతో ఓట్లు అడిగాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, సీఎం ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, నాయకులు శంకర్, తిరుపతి, రమేశ్, నరసింహులు, ఫిర్దోస్ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కరుణించేనా..!

- రెండు పర్యాయాలు బీజేపీకి భారీ మెజారిటీ ఇచ్చిన జిల్లా..
- పరిష్కారానికి నోచుకోని కేంద్రం పరిధిలోని సమస్యలు
- ఇప్పటికీ జాడ లేని రైల్వేలైన్..
- పెండింగ్‌లోనే ఈఎస్ఐ ఆస్పత్రి
- 'ట్రామాకేర్'పై కనిపించని దృష్టి
- 'జ్ఞానసరస్వతి' వర్సిటీ అవసరం
- దృష్టిసారించాలంటున్న జిల్లా వాసులు





నిర్మల్: లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు భారీ మెజార్టీ.. అదేస్థాయిలో అసెంబ్లీ పోరులో ఇద్దరు ఎమ్మెల్యేలను గెలిపించిన జిల్లాపై ఇప్పటికైనా.. కేంద్రం దృష్టిపెడుతుందా..!? ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టిన పనులకు మోక్షం కల్పిస్తుందా..!? జిల్లా అభివృద్ధికి నాంది పలుకుతుందా..!? మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువుదీరుతున్న వేళ జిల్లావాసుల నుంచి ఇలాంటి ప్రశ్నలే వస్తున్నాయి. అభిమానమొక్కటే కాదని, ఇక్కడ అభివృద్ధితోపాటు ఈప్రాంత సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకంతోనే బీజేపీకి ఓటు వేశామని జిల్లా వాసులు చెబుతున్నారు. జిల్లాలోని సమస్యలను, కావాల్సిన అవసరాలను, అభివృద్ధి చేయాల్సిన విషయాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఇక్కడి బీజేపీ ప్రజాప్రతినిధులు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవాలని జిల్లావాసులు అంటున్నారు. గట్టిగా మద్దతు ఇచ్చినందున కేంద్రం నుంచి అదేస్థాయిలో రావాల్సినవి రప్పించాలంటున్నారు.

రైలు రప్పించాలె..
ఎప్పుడో 1990 దశకం నుంచి జిల్లావాసుల కలగా ఉన్న జిల్లా మీదుగా రైల్వేలైన్ అనే మాట ఇప్పటికీ తీరడం లేదు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం తాను ఇచ్చిన మాటనూ నిలబెట్టుకోలేదన్న చర్చ జిల్లావాసుల్లో ఉంది. ఐదేళ్లక్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భాగస్వామ్యంతో ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ చేపడతామన్నారు. కానీ ఆచరణకు నోచుకోలేదు. ఆ ఒప్పందం రద్దయిందని ఇక హైదరాబాద్(పటాన్‌చెరు) నుంచే వివిధ వాణిజ్య ప్రాంతాలు, పట్టణాలు కలుపుతూ నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపిందని ప్రకటించారు. ఇది కూడా ఆచరణలో కనిపించకపోవడంపై జిల్లా వాసులు గుర్రుగానే ఉన్నారు. ఈసారైనా రైల్వేలైన్ విషయాన్ని తేల్చాలని పట్టుబడుతున్నారు. నాందేడ్ నుంచి భైంసా–నిర్మల్–ఖానాపూర్ మీదుగా మంచిర్యాల వరకు కొత్త లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. దీనిపైనా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు.

ఆస్పత్రులు కావాలె..
జిల్లాకేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి, భైంసాలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు ఎనిమిదేళ్ల క్రితమే కేంద్రం హామీ ఇచ్చింది. ఈమేరకు జిల్లాకేంద్రంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి(ప్రస్తుత డీఎంహెచ్‌వో) భవనాన్ని ఈఎస్ఐ అధికారులు పరిశీలించి వెళ్లారు. కానీ.. ఆ తర్వాత ఆ ఆస్పత్రి కథ అటకెక్కింది. ఏళ్లు గడిచిపోయినా దాని గురించి ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

పరిశ్రమలు రావాలె..
పుష్కలంగా జలవనరులు ఉండి, పచ్చని పంటలు పండే జిల్లాలో వాణిజ్యపరంగా ఉపయోగపడే పరిశ్రమలు లేకపోవడం పెద్దలోటు అని జిల్లా వాసులు అంటున్నారు. జిల్లావాసులకు ఇబ్బంది కలిగించని విధంగా.. ఇక్కడ ఉపాధితోపాటు వాణిజ్య అభివృద్ధి జరిగే పరిశ్రమలను కేంద్రం ఏర్పాటు చేయాలన్న వాదన కూడా ఉంది. స్థానిక రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించని పరిశ్రమలు ఇప్పటికైనా వస్తాయని ఆశిస్తున్నారు.

కాలేజీ, వర్సిటీ..
జిల్లాలో చదువులతల్లి కొలువున్నప్పటికీ విద్యారంగంలో చాలా వెనుకబడి ఉంది. జిల్లాలో ఇప్పటికీ ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ లేదు. ఇంజినీరింగ్ కాలేజీతోపాటు ఇక్కడ ఆనవాళ్లు లేకుండా చేసిన పీజీ కాలేజీకి తిరిగి పూర్వవైభవం తీసుకురావాలి. జిల్లాలో జ్ఞానసరస్వతీ అమ్మవారి పేరిట కొత్త వర్సిటీని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా ఎప్పటి నుంచో ఉంది.

ట్రామాకేర్ కావాలి..
జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. తరచూ వీటిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి జాతీయ రహదారులు ఉన్నచోట న్యూరోసర్జన్‌తో సహా మల్టీస్పెషాలిటీ ఎమర్జెన్సీ సేవలు అందించే ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నిర్మల్‌లో ట్రామాకేర్ పెట్టాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ పట్టించుకునేవారు లేరు.

క్లుప్తంగా

చంద్రబాబును కలిసిన నగేశ్



చంద్రబాబుతో ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: టీడీపీ అధ్యక్షుడు చంద్ర బాబును శనివారం ఢిల్లీలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం పట్ల ఆయనకు ఎంపీ అభినందనలు తెలిపారు. ఎంపీగా ఎన్నిక కావడం పట్ల నగేశ్‌కు చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్ ఉన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌లో చోరీకి యత్నం

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్‌లో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు శనివారం చోరీకి యత్నించారు. హెడ్ కానిస్టేబుల్ కథనం ప్రకారం.. ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇద్దరు కోర్టు కాంప్లెక్స్‌లోని మోటార్, రెండు పైపులను రిక్షాలో పెడుతుండగా శబ్దం వచ్చింది. అక్కడే ఉన్న అటెండర్ శ్రీనివాస్ గమనించి అరిచాడు. దీంతో వారు మోటార్, పైపులు, రిక్షాను అక్కడే వదిలేసి పారిపోయాడు. అటెండర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు అక్రమంగా నిషేధిత గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..ఉట్నూర్ మండలం శ్యామ్‌పూర్‌కు చెందిన అతిక్ దావూద్ డుంగె బైక్‌పై ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు గుట్కా తరలిస్తున్నాడు. పక్కా సమాచారంతో అంజీచౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. సుమారు రూ.32 వేల విలువ గల గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ

తానూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..హిప్నెల్లితండా గ్రామానికి చెందిన చౌవన్ సాయినాథ్, రాథోడ్ కృష్ణ శనివారం రాత్రి తానూరు నుంచి స్వగ్రామమైన హిప్నెల్లితండాకు బైక్‌పై వెళ్తున్నారు. తానూరు–బెల్‌తరోడా రహదారి హిప్నెల్లితండా బైపాస్ వద్ద మహారాష్ట్ర పాసింగ్ గల బైక్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చౌవన్ సాయినాథ్, రాథోడ్ కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై సందీప్ అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను భైంసా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారైనట్లు స్థానికులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



నాగేశ్(ఫైల్)

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీలో నాగేశ్ (30) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. నాగేశ్ అదే గ్రామానికి చెందిన విజయతో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రావడం లేదని మనస్తాపం చెందాడు. శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి రఘురాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవన భారం..ఉపాధి ప్రశ్నార్థకం!

- ప్రత్యామ్నాయం లేక అవసోపాలు
- చేతినిండా పనిలేక బీడీ కార్మికుల ఇక్కట్లు

నిర్మల్‌ఖిల్లా: రేయింబవళ్లు చెమటోడ్చి రెక్కలు ముక్కలు చేసుకుని బీడీలు చుట్టే కార్మికుల కష్టం అంతాఇంతకాదు. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా కుటుంబ పోషణ భారం మోసే మహిళలు చాలామంది ఉన్నారు. ఈ రంగంపై ఆధారపడిన వారికి ప్రస్తుతం ఉపాధి కరువు అవుతోంది. బీడీల తయారీని జీవనాధారంగా మార్చుకున్న ఎంతోమంది ప్రత్యామ్నాయం లేక అవసోపాలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వెతలు అనుభవిస్తున్న కార్మికులు బతుకు బండి లాగేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. తమ కష్టాలు తీర్చి గట్టెక్కిస్తామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు తమకు నమ్మకం కలిగించలేకపోతున్నారు. ఆకు(తునికి)ను ప్రత్యేక నమూనాలో కత్తిరించి, పొడి తంబాకును అందులో వేసి ఒపిగ్గా మడిచి దాని చుట్టూ దారం కడితే అప్పుడు బీడీ తయారవుతుంది. ఇలా చెమటోడ్చి శ్రమించే ఎంతోమంది కార్మికులు చేతినిండా పని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్రాంతంలో బీడీ పరిశ్రమ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1.20 లక్షల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారు. నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ ప్రాంతాల్లో బీడీ పరిశ్రమ విస్తరించి ఉంది. పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలు బీడీ చుడుతూ ఉపాధి పొందుతున్నారు. బీడీలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోవడంతో తగినంత పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారింది. మరోవైపు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాల ప్రయోజనాలు పొందడం లేదని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీనెలలో 26 రోజులు కనీసం పని దినాలు కల్పించాల్సి ఉన్నా, ప్రస్తుతం 15 రోజులు మించి పనులు ఉండడం లేదు. ప్రతీఒక్కరికి రోజుకు వెయ్యి బీడీలకు సరిపడా ఆకు, తంబాకు అందించాల్సి ఉన్నా కంపెనీల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించలేకపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శివాజీ దేశాయి చారుబాయ్ తదితర కంపెనీలు 40 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 13 బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. 1.20 లక్షలమంది కార్మికులు ప్రస్తుతం బీడీలు చుడుతున్నారు. వీరిలో సుమారు 75 వేల మందికి పీఎఫ్ ఉండగా, మిగతా వారికి ఈ సౌకర్యం లేదు.



బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు (ఫైల్)

- గతంలో పదేళ్లు పనిచేస్తే 50 ఏళ్లు నిండిన తర్వాత పింఛన్ అమలయ్యేది. ప్రస్తుతం 3,365 రోజులు పనిచేస్తేనే పింఛన్ అందేలా జీవో సవరించారు.

సమస్యలు పరిష్కరిస్తే మేలు..

- బీడీ రంగంపై జీఎస్టీ వస్తుసేవల పన్ను భారంగా మారింది. వెంటనే మినహాయింపు ఇవ్వాలి.
- కార్మికుల పింఛన్ రూ.వెయ్యి వరకు ఉంది. ప్రతినెల రూ.5వేల పింఛన్ అమలు చేయాలని డిమాండ్ ఉంది.
- ఈఎస్ఐ వర్తింపజేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించేలా జిల్లా కేంద్రాల్లో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలి. కుటుంబానికి ప్రత్యేక ఆరోగ్య బీమా కల్పించాలి.
- బీడీ కంపెనీల యాజమాన్యాలు నాసిరకం ముడి సరుకులు సరఫరా చేయకుండా, నాణ్యంగా అందించాలి.
- ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.245.8 మాత్రమే కూలి ఇస్తున్నారు. దాన్ని రూ. 500 ఇవ్వాలి. ప్రతినెలలో కనీసం 24 రోజులు పని దినాలు కల్పించాలి.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



నిందితులు, పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలతో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల శివారులో ఇద్దరు నిందితులు బైక్‌పై తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్సై లచ్చన్న శనివారం పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. ఇద్దరు నిందితులు జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి మంచిర్యాల వైపు బైక్‌పై రెండు బ్యాగులతో వస్తున్నారు. పక్కా సమాచారంతో తనిఖీ చేయగా రూ.1.80 లక్షల విలువ గల 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకుని విచారించగా కాసిపేట మండలం తుంగగూడెంకు చెందిన గుండవేణి రాజశేఖర్, ధర్మారావుపేటకు చెందిన ముచ్చెర్ల సంపత్‌గా గుర్తించారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన షాబుద్దీన్ నుంచి తక్కువ ధరకు నకిలీ పత్తివిత్తనాలు కొనుగోలు చేసి జిల్లా పరిధిలోని అమాయక రైతులకు అమ్మేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి బైక్, 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని హాజీపూర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

ఒమన్‌లో గల్ఫ్ కార్మికుల సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న తెలంగాణ వాసులు

ఖానాపూర్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకుని ఒమన్‌లో గల్ఫ్ కార్మికుల సంబురాలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఒమన్ తెలంగాణ సమితి కన్వీనర్ గుండేటి గణేశ్, కో కన్వీనర్ నూనె లక్ష్మణ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల పోటీలు, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు ప్రదర్శనలు చేయడంతో పాటు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి



ఢీకొన్న బైక్‌లు



మృతి చెందిన కామన్నపటేల్

ముథోల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం..ముథోల్ వైపు నుంచి రెండు బైక్‌లు శనివారం బాసరకు వెళ్తున్నాయి. ముథోల్‌లోని శివాజీ బీడీ కంపెనీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాసర మండలం బిద్రెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ తపాలా ఉద్యోగి కామన్న పటేల్(69) అక్కడిక్కడే మృతి చెందగా, భైంసాకు చెందిన రాహుల్, నారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పొక్లెయిన్ దగ్ధం

- బావోజిపేట్ అటవీప్రాంతంలో ఘటన



దగ్ధమైన పొక్లెయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలోని బావోజిపేట్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పొక్లెయిన్ దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. టైగర్‌జోన్ అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో బావోజిపేట్ అటవీ పరిధిలో రెండు రోజులుగా కందకాలు(బౌండ్రీ ట్రెంచ్) తవ్వుతున్నారు. అక్కడ పోడు రైతులకు అటవీశాఖ సిబ్బంది మధ్య వివాదం నడుస్తోంది. శుక్రవారం ఉదయం సిబ్బంది కందకాలు తవ్వుతుండగా రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అక్కడికెళ్లి పోడు రైతులకు ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కందకాలు తవ్వుతున్నట్లు వివరించారు. కాగా, రాత్రి సమయంలో పొక్లెయిన్‌కు నిప్పు పెట్టడంతో అటవీశాఖ, పోడు రైతుల మధ్య వివాదం మరింత జఠిలమైంది. ఈ ఘటనపై టైగర్ జోన్ ఎఫ్ఆర్వో గణేశ్ రాతపూర్వకంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

బాసరకు పోటెత్తిన భక్తులు



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు



అక్షర శ్రీకారం చేయించుకుంటున్న పిల్లలు

బాసర: వేసవి సెలవులు మరో నాలుగు రోజుల్లో ముగియనుండడం, శని, ఆదివారం సెలవు కావడంతో బాసర జ్ఞాన సరస్వతీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి సైతం భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి నది తీరాన ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మ వారి దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు నిర్వహించి. ఈవో విజయరామారావు ఏర్పాట్లను పరిశీలించారు.

11న హుండీ లెక్కింపు...

బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన హుండీ కానుకలను ఈనెల 11న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకలు లెక్కిస్తామని పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు, బాసర, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు ఈ ప్రక్రియలో పాల్గొంటారని వివరించారు.



క్యూలైన్లో భక్తులను పర్యవేక్షిస్తున్న ఈఓ

13న బహిరంగ వేలం

రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిధిలో ఉన్న 8 దుకాణాల సేల్స్ కౌంటర్లను ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈవో విజయరామారావు తెలిపారు. వీటితోపాటు ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి అమ్మకాలు, కొబ్బరి ముక్కలను పోగు చేసుకోవడానికి కూడా సీల్డ్ టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీకి చెందిన బొజ్జ నర్సింహులు (37) శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సింహులు ప్రతీరోజు తన ఇంట్లో కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుత్ సరఫరా అయి షాక్ తగిలింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య జ్యోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

వాంకిడి: కడుపునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. మండలంలోని కనర్‌గాం గ్రామానికి చెందిన జాడి కమలాకర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కల్యాణ్ (20) ఉన్నారు. కల్యాణ్ జిల్లాకేంద్రంలో బైక్ మెకానిక్ గ్యారేజ్ నడుపుతుండేవాడు. కొన్నినెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ప్రతీరోజు మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో కుటుంబీకులు మందలించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆసిఫాబాద్‌లో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్న చెల్లెని బైక్‌పై ఇంటికి తీసుకువచ్చాడు. ఆ తర్వాత పెరట్లో మద్యం తాగాడు. మత్తులో అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి అరుపులు వినిపించడంతో కుటుంబీకులు అక్కడికి చేరుకున్నారు. అతన్ని కారులో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి శనివారం శవపరీక్ష నిర్వహించారు. తండ్రి కమలాకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

25 ఏళ్ల కల.. నెరవేరిన వేళ



డీఈవోను కలిసి వినతిపత్రం అందజేస్తున్న భాష పండితులు (ఫైల్)

- పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడ్
- జిల్లాలో 220 భాష పండితులు, 25 పీఈటీలు
- పదోన్నతులకు మార్గం సుగమం

ఆదిలాబాద్‌టౌన్: భాష పండితులు, పీఈటీల 25 ఏళ్ల కల ఎట్టకేలకు నెరవేరింది. ఈ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు మార్గం సుగమం కావడంతో వారిలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత తరగతులకు బోధిస్తున్నప్పటికి ఎస్జీటీ క్యాడర్‌లో పనిచేస్తుండటం వారిలో తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. పోస్టుల అప్‌గ్రేడ్‌కు గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినప్పటికి నెరవేర్చలేదు. ఇందుకు సంబంధించి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు ఇటీవల భాషా పండితులు, పీఈటీలకు అనుకూలంగా తీర్పునివ్వడంతో ప్రభుత్వం పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం జరుగనున్న ప్రక్రియలో వారికి పదోన్నతులు లభించనున్నాయి. అయితే కొందరు ఎస్జీటీలు దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లే యోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగుతుందా లేక గతంలో మాదిరిగానే ఆగిపోతుందా అనేదానిపై భాష పండితులు, పీఈటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో విద్యాశాఖ అధికారులు ఆదిశగా కసరత్తు చేస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం చర్యలు చేపడుతున్నారు.

ఏళ్ల నిరీక్షణకు తెర..

భాష పండితులు, పీఈటీలు గత 25 ఏళ్లుగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. వీరి కంటే జూనియర్లు పదోన్నతులు పొందడంతో వారు నిరుత్సాహంగా ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. గతేడాది పదోన్నతుల ప్రక్రియ జరిగినప్పుడు తాము 6,7 తరగతులకు మాత్రమే బోధిస్తామని సహాయ నిరాకరణకు దిగారు. అయినప్పటికి వారి సమస్య తీరలేదు. పలు ప్రభుత్వాలను కలిసి తమ గోడును విన్నవించుకున్నప్పటికి పదోన్నతులు లభించలేదు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడినట్లైంది.

అప్‌గ్రేడ్ అయిన పోస్టులివే

జిల్లాలో భాషా పండితులకు సంబంధించి 248 పోస్టులుండగా 220 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. అదేవిధంగా 30 పీఈటీ పోస్టులుండగా 25 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. వీరందరికి పదోన్నతులు లభించనున్నాయి. తెలుగు పండిట్ పోస్టులు 128కి గాను 114 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అలాగే హిందీలో 107కు గాను 96 పోస్టులు, ఉర్దూలో 8 పోస్టులకు గాను ఏడు పోస్టులు, మరాఠిలో ఐదు పోస్టులకు గాను 3 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. పీఈటీ తెలుగు మీడియంలో 27 పోస్టులకు గాను 22 పోస్టులు, హిందీ, ఉర్దూ, మరాఠి మీడియంలో ఒక్కో పోస్టు అప్‌గ్రేడ్ అయ్యాయి.